దుర్గం చెరువు పై ఓవర్ డారిలో రాళ్ల గుట్టలపై సరికొత్త పెయింటింగ్‌లు వేసిన దృశ్యం

ఇదేం పనిభారం?

యుఎల్‌బీలకు స్పెషల్ ఆఫీసర్లుగా జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్లు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : 'మూలిగే నక్కపై తాటిపండు పడిందన్న చందంగా' కోటికి మందికిపైగా సేవలందించే బల్దియాలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్లు కొత్తగా అదనపు బాధ్యతలు వచ్చి పడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలు అర్బన్ లోకల్ బాడీ (యుఎల్‌బీ)లలో స్పెషల్ ఆఫీసర్ల నియామకం జరుపుతూ వస్తున్న ప్రభుత్వం..తాజాగా జీహెచ్ఎంసీలో పలు విభాగాలకు అడిషనల్ కమిషనర్లుగా కొనసాగుతున్న 9 మందికి జీహెచ్ఎంసీ అవతల ఉన్న మున్సిపల్ కార్పొరేషన్లకు స్పెషల్ ఆఫీసర్లుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు కె.అలివేలు మంగతాయరు, గుండ్లపోచంపల్లికి డాక్టర్ ఎన్ యాదగిరి రావు, బోడుప్పల్ మున్సిపాలిటీకి ఎస్ పంకజ, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌కు కె. సత్యనారాయణ, జల్‌పల్లికి జి. నళిని పద్మావతి, శంషాబాద్‌కు బి. గీతా రాధిక, శంకర్‌పల్లికి ఎన్ సామ్రాట్ ఆశోక్, ఆమీర్‌పూర్‌కు ఎన్ వాణిశ్రీ, బొల్లారంకు జి. వేణుగోపాల్ రెడ్డిలను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. ఇప్పటికే కీలక బాధ్యతల్లో ఉండి...క్షేత్రస్థాయి పర్యవేక్షణలో లేమితో ప్రజా సమస్యలు పెరిగిపోతున్న ఈ తరుణంలో అడిషనల్ కమిషనర్లకు కొత్త బాధ్యతలు అప్పగించడం పట్ల ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

దుర్గం చెరువు పరిరక్షణకు చర్యలు

సిటీబ్యూరో: దుర్గం చెరువు పరిరక్షణకు ప్రభుత్వం సిద్ధమైంది. చెరువులో మురుగు నీరు చేరి అది కలుషితం కాకుండా తగిన చర్యలు చేపట్టనుంది. అందులో భాగంగానే పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దానకిశోర్ ఆదేశాల మేరకు మంగళవారం చెరువు పరిసరాలను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, లేక్స్, రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇతర విభాగాల అధికారులు పరిశీలించారు. చెరువులో మురుగు నీరు చేరకుండా తగిన చర్యలు చేపట్టడానికి జాయింట్ ఇన్ స్పెక్షన్ నిర్వహించారు. రహేజా మైండ్ స్పేస్ ప్రాంతాల్లో భవన నిర్మాణ, గార్డెనింగ్, ల్యాండ్ స్కేపింగ్ అవసరాల కోసం ఎస్టీపీలో శుద్ధి చేసిన నీటినే వాడుకోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరి మృతి

బొల్లారం, ఫిబ్రవరి 18: మితిమీరిన వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ఓ ద్విచక్ర వాహనాదారుడు మరో ద్విచక్ర వాహనదారుడిని ఢీ కొట్టగా మృతి చెందాడు. ఈ ఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ లక్ష్మీనారాయణ రెడ్డి వివరాల ప్రకారం బోయిన్‌పల్లి బాపూజీ నగర్‌కు చెందిన చీర్ల నర్సింగ్ యాదవ్(29) ఈ నెల 17న ద్విచక్ర వాహనంపై న్యూ బోయిన్‌పల్లిలోని సెంటర్ పాయింట్ వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో బాపూజీనగర్ చౌరస్తాలోని ట్రాఫిక్ సిగ్నల్ వద్ద పల్సర్ (టీఎస్ జి 7151) పై వచ్చిన వాహనదారుడు నర్సింగ్ యాదవ్‌ను ఢీ కొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికంగా ఉన్న వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆరు చెరువుల పునరుద్ధరణ

హెచ్ఎండీఏ నుంచి నిధులు

జూన్‌కల్లా పూర్తి చేస్తాం: హైడ్రా కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ): తొలిదశలో ఆరు చెరువులను పునరుద్ధరించడానికి హైడ్రా అవసరమైన చర్యలను ప్రారంభించింది. ఇప్పటివరకు చెరువుల్లో ఉన్న ఆక్రమణల తొలగింపుకే పరిమితమైన హైడ్రాకు పరిరక్షణ బాధ్యతలు చేపట్టడానికి అవసరమైన నిధులను హెచ్ఎండీఏ నుంచి సమకూర్చుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తొలుత పది చెరువులు అనుకున్నప్పటికీ.. ఇప్పటివరకు ఆరు చెరువులకు సంబంధించిన పునర్‌నిర్మాణం, అభివృద్ధికి సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్)లను బెంగళూరు సంస్థ ద్వారా సిద్ధం చేయించింది. త్వరలో చెరువుల పునర్‌నిర్మాణానికి సంబంధించిన టెండర్లను పిలుస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఫుల్ ట్యాంక్ లెవల్స్ నిర్ధారించి ఆక్రమణలు తొలగింపు పూర్తయిన వాటినే తొలిదశలో ఎంపిక చేసుకున్నారు. ఈమేరకు కూకట్‌పల్లి నల్లచెరువు, అల్లాపూర్ సున్నంచెరువు, ఉప్పల్‌భగాయత్ నల్లచెరువు, బాగ్‌అంబర్‌పేట్ బతుకమ్మకుంట,మాదాపూర్ తమ్మిడికుంటలను ఎంచుకున్నారు. గత మూడురోజులుగా ఈ ఐదు చెరువుల వద్ద పూడికతీత, చెరువుల వద్ద ఉన్న వ్యర్థాలు తొలగించడం, చుట్టూ ఉన్న చెత్తా చెదారం తీసేయడం వంటి పనులు చేస్తున్నారు. మంగళవారం బతుకమ్మ కుంటవద్ద పూడికతీత పనుల్లో నీరు బయటకు వచ్చింది.

మూడు అంశాలపై దృష్టి

తొలిదశలోఎంపిక చేసుకున్న చెరువులన్నీ కాలుష్యం కోరల్లోనే ఉండడంతో ఆయా చెరువుల్లో ఉన్న నీటిని పూర్తిగా బయటకు తీసి ఆపై నేలనంతా శుద్ధి చేయిస్తారు. చెరువులోకి మురుగునీరు రాకుండా సీవరేజ్ పైప్‌లేన్ ఏర్పాటుచేస్తారు. మరోవైపు చెరువులోకి వర్షపునీరు వచ్చి చేరేలా చుట్టు పక్కల ప్రాంతాల్లో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు. ఒకవైపు కాలుష్య రహితంగా, మరోవైపు వర్షపు నీరు వచ్చి చేరడం, చుట్టుపక్కల ఆహ్లాదకరమైన పరిసరాలు ఏర్పాటు చేయడం వంటి అంశాలను ప్రస్తుతం ఈ చెరువుల పునరుజ్జీవనంలో తీసుకుంటున్నారు. బతుకమ్మ చెరువు వద్ద పూడికతీత పనులు ప్రారంభం కాగా మిగతా చెరువుల్లో నీరు తొలగిస్తున్నారు. ఈ చెరువుల పునరుజ్జీవనం ప్రక్రియ జూన్‌కల్లా పూర్తి చేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

బతుకమ్మ కుంటకు పునర్ వైభవం తెచ్చాం- హైడ్రా

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ):బాగ్‌అంబర్‌పేటలోని బతుకమ్మకుంట పునరుజ్జీవనానికి చర్యలు చేపట్టామని హైడ్రా తెలిపింది. మంగళవారం కుంటలో పూడిక తీస్తుండగా నీరు పెల్లుబికి వచ్చింది. మోకాలు లోతు మట్టితీయగానే గంగమ్మ బయటకు వచ్చిందంటూ స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా నింపిన మట్టిని తొలగిస్తే చెరువు నీటితో కళకళలాడుతుందని వారు పేర్కొన్నారు. అంబర్‌పేట మండలం బాగ్‌అంబర్‌పేటలోని సర్వే నెంబర్ 563లో 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మ కుంట ఉంది. బఫర్ జోన్‌తో కలిపి మొత్తం వైశాల్యం 16.13ఎకరాలుగా సర్వే అధికారులు తేల్చారు. తాజా సర్వే ప్రకారం అక్కడ మిగిలిన భూమి కేవలం 5.15 ఎకరాల విస్తీర్ణం మాత్రమే కాగా ఈ మిగిలిన విస్తీర్ణంలోనే బతుకమ్మకుంటను పునరుద్ధరించడానికి హైడ్రా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గతంలోనే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు పలువురు రెవెన్యూ,మున్సిపల్, ఇరిగేషన్, సర్వే అధికారులు బతుకమ్మకుంట ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ నివాసమున్న వారికి ఎలాంటి ముప్పులేకుండా చెరువు తవ్వాలంటూ ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో బతుకమ్మకుంట పునరుజ్జీవనానికి చర్యలు చేపట్టారు. కాగా అది ఉబికి వచ్చిన నీరు కాదని అక్కడి పైప్‌లైన్ పగలడం వల్లే అలా జరిగిందని పెద్ద ఎత్తున్న ప్రచారం జరిగింది. ఈ ప్రచారాన్ని జలమండలి అధికారులు కొట్టపడేశారు.

బెట్టింగ్‌ముఠా పట్టివేత

వెంగళరావునగర్, ఫిబ్రవరి 18 – గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతున్న ఆన్ లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠాను ఎస్సార్ నగర్ పోలీసులు పట్టుకున్నారు. స్థానికులను బుకీలుగా చేర్చి, నకిలీ సిమ్ కార్డులతో బ్యాంకు ఖాతాలు తెరిచి తైవాన్ కేంద్రంగా కొనసాగుతున్న క్రికెట్ బెట్టింగ్ రాకెట్ గుట్టును ఛేదించారు. ఎస్సార్‌నగర్ పోలీసు స్టేషన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్ స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి వివరాలను వెల్లడించారు. మాదాపూర్‌కు చెందిన లింగాల అరుణ్ రాజ్(24)కు క్రికెట్ పై ఆసక్తితో, క్రికెట్ కంటెంట్ ను పంచుకునేందుకు ''క్రికెట్–360 మీడియా'' అనే ఇన్స్టాగ్రామ్ పేజీని సృష్టించాడు. ఆ తరువాత అతన్ని ''గుగోబెట్ ఇండియా'' అనే ప్రమోషనల్ వీడియో ఆకర్షించడంతో తైవాన్ జాతీయుడైన గ్రెగోరియా అనే ప్రధాన బుకీ నిర్వహిస్తున్న ఆన్లైన్ బెట్టింగ్ కార్యకలాపాల్లో చేరాడు. ''హైపర్ టూల్'' అనే ఆన్లైన్ అప్లికేషన్ ద్వారా లావాదేవీలను నియంత్రిస్తూ క్రికెట్ బెట్టింగ్ నిర్వహించడం మొదలుపెట్టాడు. ఆ తరువాత అరుణ్ రాజ్ తన సోదరుడైన ఎస్.ఆర్.నగర్ లోని జయప్రకాష్ నగర్ లో నివాసం ఉండే లింగాల సాకేత్(23), స్నేహితుడైన మేకల సంజయ్ (22)లను కూడా బుకీలుగా చేర్చుకున్నాడు.

జయప్రకాశ్ నగర్ కేంద్రంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్సార్‌నగర్ పోలీసులు సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో జయప్రకాష్ నగర్ లోని బుకీల ఇళ్లలో మంగళవారం దాడులు నిర్వహించారు. అరుణ్ రాజ్, సాకేత్, సంజయ్ ను అరెస్టు చేశారు. వీరితో పాటు తైవాన్ జాతీయుడైన ప్రధాన బుకీ గ్రెగోరియాతో పాటు నకిలీ సిమ్ కార్డులతో ఖాతాలు తెరచిన చిట్టిమల్ల అక్షయ్, రావుల రవితేజ, మహ్మద్ ముజమ్మిల్ అమన్, కొత్వాల్ సందీప్ కుమార్, బెగారి సతీష్, తల్లా అక్షయ్, పంజలాల భానుతేజ, మండల రాజ్ కుమార్, మట్టా సాయికృష్ణలపై కేసు నమోదు చేసి వారి కోసం గాలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రేవంత్‌రెడ్డివి చిల్లరవేషాలు!

బిఆర్ఎస్‌పార్టీపై అసత్యప్రచారం చేస్తున్నారు..

కాంగ్రెస్ సోషల్ మీడియాపై చర్యలు తీసుకోవాలి..

సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు బిఆర్ఎస్ నేతల ఫిర్యాదు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ): చెల్లనిరూపాయికి గీతలెక్కువ.. చేతకాని రేవంత్‌రెడ్డికి చిల్లర వేషాలెక్కువ.. అంటూ బిఆర్ఎస్‌నేత దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. బిఆర్ఎస్ పార్టీపై అసత్యప్రచారంచేస్తున్న తెలుగువైబ్ ట్విట్టర్ హ్యాండిల్‌పై కఠినచర్యలు తీసుకోవాలంటూ మంగళవారం సైబరాబాద్, సైబర్‌క్రైమ్ స్టేషన్‌లో దాసోజు శ్రవణ్, డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, అభిలాష్ రంగినేని, కురువ విజయ్‌కుమార్‌లు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తెలుగువైబ్ ట్విట్టర్ హ్యాండిల్ సృష్టించి బిఆర్ఎస్ నేతలు, నాయకత్వంపై చిల్లర ప్రచారం చేస్తున్నదన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు మధ్య విభేదాలు ఉన్నట్లు విష ప్రచారం చేస్తున్నదని, తప్పుడు పోస్టులు పెట్టడంద్వారా బీఆర్ఎస్‌ను బద్నామ్ చేయాలని రేవంత్‌రెడ్డి కుట్రకు తెరలేపారని శ్రవణ్ ఆరోపించారు. బిఆర్ఎస్ కేడర్ మనోస్థైర్యాన్ని అబద్ధపు కథనాలతో దెబ్బతీస్తున్న తెలుగువైబ్‌పై ఐటి చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులను తాము కోరామని శ్రవణ్ చెప్పారు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి బిఆర్ఎస్ కీలకనేతగా ఉన్న మాజీ మంత్రి హరీశ్ రావు ప్రతిష్ట దెబ్బతీసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ కాంగ్రెస్ పార్టీ తమ నేతల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నదని, సోషల్ మీడియాలో బిఆర్ఎస్‌పై అసభ్య పోస్టులు పెడుతున్న వారిపై ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. కనీసం ఈ విషయంలో తాము ఇచ్చిన ఆధారాలతో ఎఫ్ఐఆర్ చేయాలని పోలీసులను కోరామన్నారు. గతంలో కేటిఆర్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేసినందుకు ఐఏఎస్, ఐపీఎస్ అదికారుల సంఘాలు స్పందించాయని, మరి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని, వీటిపై సంఘాలు ఎందుకు మౌనంగా ఉన్నాయో చెప్పాలని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

ఇసుక డంప్‌లపై టాస్క్‌ఫోర్స్ దాడులు

1098 టన్నుల ఇసుక స్వాధీనం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ఇసుకు మాఫియాపై టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం మోపుతున్నది. అక్రమంగా ఇసుక అమ్ముకునేవారు ఇతర ప్రాంతాలకువెళ్లి అక్కడ ఇసుక బుక్ చేసి హైదరాబాద్‌లో డంప్ చేస్తున్నారు. ఇసుక రీచ్ నుంచి పదివేలకు కొని హైదరాబాద్‌లో 50వేలకు అమ్ముతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో మంగళవారం సిటీలోని పలుచోట్ల ఇసుకడంపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ బృందాలు ఈ దాడుల్లో పాల్గొన్నాయి. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పరిధిలోని తుకారాంగేట్, బోయిన్‌పల్లి, త్రిములఘరీ, బేగంపేట, సికింద్రాబాద్‌లలో 889 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పరిధిలోని మధురానగర్‌లోని జానకమ్మతోట, యూసుఫ్‌గూడలలో 143టన్నులు, సెంట్రల్‌జోన్ పరిధిలోని ముషీరాబాద్, గాంధీనగర్, దోమలగూడలలో 66 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ డిసిపి సుధీంద్ర తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఇసుక డంపులపై టాస్క్‌ఫోర్స్, రెవెన్యూ అధికారులు కలిసి తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేకుండా హైదరాబాద్ వరకు ఇసుక తీసుకువస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ దాడుల్లో మొత్తం రూ.58.72లక్షల ఇసుక స్వాధీనం చేసుకోగా, 9లారీలు, 5టిప్పర్లు, 8ట్రాక్టర్లు, 1వ్యాన్ సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

లక్ష కొట్టు.. సర్టిఫికెట్ పట్టు!

నకిలీ సర్టిఫికేట్ల తయారీ ముఠా గుట్టు రట్టు

ఆరుగురిని అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

హైదరాబాద్‌లో ఫేక్ సర్టిఫికెట్ ముఠా అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న టాస్క్‌ఫోర్స్ డిసిపి సుధీంద్ర

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ): డిగ్రీ, పిజి, ఇంజనీరింగ్, డిప్లొమా .. ఇలా ఏ సర్టిఫికెట్ కావాలన్నా.. ఏ యూనివర్సిటీదైనా సరే లక్ష ఇస్తే చాలు సర్టిఫికెట్లు సృష్టిస్తున్నారు నకిలీ తయారీదారులు. ఫిల్మ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇలా నకిలీ సర్టిఫికేట్లు తయారు చేస్తున్న ముఠా సభ్యులు ఆరుగురిని హైదరాబాద్ వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. తెలంగాణ, ఆంధ్ర, అన్నామలై యూనివర్సిటీలకు చెందిన ఈ సర్టిఫికేట్లు తయారుచేశారు. వీటిపై కొందరు విదేశాలకు కూడా వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఒరిజినల్ మాదిరిగానే ఉండడంతో పాటు ఇవి అన్ని ఉద్యోగాలకు పనిచేస్తాయంటూ నమ్మబలికి గ్యాంగ్ సభ్యులు ఏజెంట్ల ద్వారా అవసరమున్నవారిని గుర్తించి పెద్ద ఎత్తున డబ్బులు లాగి వారికి అంటగడ్తున్నారు. మంగళవారం సికింద్రాబాద్ నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ డిసిపి కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ డిసిపి సుధీంద్ర మీడియా సమావేశం నిర్వహించారు. ఫేక్ సర్టిఫికేట్ ముఠాలో వజహల్ అలీ నకిలీ సర్టిఫికేట్లతో దొరికాడని తెలిపారు. ఈ క్రమంలో విచారణ జరుపుతుంటే నకిలీ సర్టిఫికేట్స్ తయారీలోరాజీఉల్లాఖాన్, హబీబ్ ఉన్నట్లు వజహత్ అలీ చెప్పాడని, ఇంకొందరు కూడా ఉన్నట్లు తమకు సమాచారం వచ్చిందని అన్నారు. మంగళవారం పరేడ్ గ్రౌండ్ దగ్గరికి గ్యాంగ్ సభ్యులు అందరూ వచ్చినట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి వాళ్లను పట్టుకున్నామని సుధీంద్ర తెలిపారు. వారి వద్ద ఉన్న నకిలీ సర్టిఫికేట్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగులు అత్యాశకు పోయి ఇలాంటి షార్ట్‌కట్ పద్ధతిలో ఫేక్ సర్టిఫికెట్స్ తీసుకోవద్దని డీసీపీ సుధీంద్ర సూచించారు. ఈ సమావేశంలో వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జంగయ్య, ఫిల్మ్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ ఎం శ్రీనివాసులు, ఎస్ఐలు అరవింద్ గౌడ్, మహ్మద్ జహెద్, సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట విలపిస్తున్న బాలు కుటుంబ సభ్యులు

బాలు మృతదేహం లభ్యం

మూడు రోజుల క్రితం పొన్నాల్ చెరువులో గల్లంతు

శామీర్‌పేట, ఫిబ్రవరి 18: స్నేహితులతో కలిసి పొన్నాల్ గండి చిత్తారమ్మ చెరువు వద్దకు వచ్చి ఈత కొడుదామని అందులోకి దిగి గల్లంతైన యువకుడి మృతదేహాన్ని మంగళవారం వెలికితీశారు. ఆదివారం సాయంత్రం గల్లంతైన బాలు కోసం మూడు రోజులుగా గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్న విషయం తెలిసిందే. చివరకు మంగళవారం ఉదయం వెలికితీయగా కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. బాలు తల్లి దండ్రులు గుండెలు బాదుకుంటూ విలపించారు. పోలీసులు శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని గాంధీకి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

అత్యవసరంగా కార్గో ల్యాండింగ్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 18: గేర్‌లో తలెత్తిన సమస్య కారణంగా ఓ కార్గో విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా దిగింది. మంగళవారం చెన్నై నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న కార్గో విమానంలో ల్యాడింగ్ గేర్‌లో సమస్యరాగా పైలెట్ గుర్తించాడు. వెంటనే గ్రౌండ్ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు సురక్షితంగా విమానాన్ని కిందకు దింపారు.

రూ.22 లక్షల విదేశీ కరెన్సీ పట్టివేత..

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 18: శంషాబాద్ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడి వద్ద భారీ విదేశీ కరెన్సీ పట్టుబడింది. ఎయిర్‌పోర్టు అధికారుల ప్రకారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్ వెళ్తున్న ప్రయాణికుడు అమీర్ అహ్మద్ కదలికలపై అనుమానం రాగా.. సీఐఎస్ఎఫ్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రూ.22 లక్షల విలువైన విదేశీ కరెన్సీ లభించగా.. స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పార్క్ చేసి ఉన్న వాహనాలే వారి టార్గెట్!

ముగ్గురు దొంగల అరెస్ట్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ):పార్క్ చేసి ఉన్న వాహనాలను దొంగతనం చేస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను మంగళవారం జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణానగర్‌కు చెందిన చంద్రశేఖర్, ఇంద్రానగర్‌కు చెందిన సూరిబాబు, జూబ్లీహిల్స్‌కు చెందిన ప్రసాద్‌లు ఆటోమొబైల్ దొంగతనం కోసం క్రైమ్ సిండికేట్‌గా ఏర్పడి వివిధ ప్రాంతాల్లో పార్కు చేసి ఉన్న వాహనాలను దొంగిలించడం, వాటిరూపాన్ని మార్చడం తర్వాత వాటిని విక్రయించడం చేసేవారు. జూబ్లీహిల్స్ క్లబ్ రోడ్‌నెంబర్ 16వద్ద జరిపిన వాహన తనిఖీల్లో నెంబర్ ప్లేట్ లేని హోండా యాక్టివాను నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా ఈ ముఠా గుట్టు బయటపడిందని పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి మూడు హోండా యాక్టివా వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వారు పేర్కొన్నారు. నిందితులు గతంలో మధురానగర్, జూబ్లిహిల్స్ పరిధిలో పలు చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. ముఠా సభ్యులను అరెస్ట్ చేసి మూడవ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్, హైదరాబాద్ ముందు హాజరుపరచగా జ్యుడీషియల్ కస్టడీ విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కేవైసీ అంటూ రూ.1.78 లక్షలు టోకరా

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ): కేవీసీ అప్‌డేట్ అంటూ ఓ ప్రైవేట్ ఉద్యోగినికి లింక్ పంపిన నేరగాళ్లు రూ.1.78 లక్షలు తస్కరించారు. సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగినికి రెండురోజుల క్రితం ఆర్బీఎల్ బ్యాంకు నుంచి కేవైసీ అప్‌డేట్ అంటూ కాల్ వచ్చింది. లింక్ పంపి ఆర్బీఎల్ క్రెడిట్ కార్డ్ వివరాలను అప్‌డేట్ చేయమని అడిగాడు. కార్డు వివరాలను నమోదు చేస్తుండగానే హెచ్‌డీఎఫ్‌సీ నుంచి మెసేజెస్ రావడంతో ఆమె వెంటనే తన బ్యాంక్ అకౌంట్స్ హోల్డ్ చేయాలని హెచ్‌డీఎఫ్‌సీ, ఫెడరల్ బ్యాంక్‌లను సంప్రదించింది. సాయంత్రం ఆమెకు యాక్సిస్ బ్యాంక్ నుంచి తన డబ్బులు పోయినట్లుగా మెసేజ్ రావడంతో సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఓఆర్ఆర్‌పై కారుతో ఫీట్లు..

ఐదుగురు యువకులు అరెస్టు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 18 : ఔటర్‌రింగ్ రోడ్డుపై కార్లను రింగులు తిప్పుతూ ఇతర ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసిన ఇద్దరు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన్నట్లు శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరించారు. రాజేంద్రనగర్‌లోని అత్తాపూర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఒబేదుల్లా అన్నారీ(విద్యార్థి), మలక్‌పేట్ ప్రాంతానికి చెందిన జోహేర్ సిద్ధుఖీ(విద్యార్థి), మరో ముగ్గురు మిత్రులతో కలిసి ఈ నెల 9 తేదిన తెల్లవారుజామున 3 గంటల సమయంలో శంషాబాద్ మండలంలోని పెద్దగోల్కొండ ఎగ్జిట్ నంబర్ 15, తొండుపల్లి ఎగ్జిట్ నంబర్ 16 మధ్యలో నంబర్ లేని 2 ఖరీదైన కార్లతో ఔటర్‌రింగ్‌రోడ్డుపై రింగులు తిప్పుతూ చేసిన విన్యాసాలు సీసీ ఫుటేజ్‌లో రికార్డు అయ్యాయి. ఓఆర్ఆర్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన శంషాబాద్ పోలీసులు రెండుకార్లను స్వాధీనం చేసుకొని కార్లను నడిపిన ఇద్దరు యువకులతో పాటు కార్లలో ఉన్న మరో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ నరేందర్‌రెడ్డి, ఎస్సైలు భాస్కర్‌రావు, నర్సింహరావుతో పాటు ఇతర సిబ్బంది ఉన్నారు.

తాను మరణించి.. నలుగురికి జీవితాన్నిచ్చి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 18: డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తికి రక్తపోటు పెరిగి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టిన సంఘటన తుకారం గేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. ఘట్ కేసర్ ప్రాంతానికి చెందిన గదియాల శ్రీనివాస్ వ్యాపారవేత్త. ఈయనకు సంవత్సరం క్రితమే బైపాస్ సర్జరీ జరిగింది. శ్రీనివాస్ కు భార్య ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే ఈనెల 15వ తేదీ రాత్రి 10:30 గంటల సమయంలో తుకారం గేట్ మీదుగా కారులో వెళుతుండగా దేనా బ్యాంక్ వద్దకు రాగానే శ్రీనివాస్ కు రక్తపోటు పెరిగి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో అదుపుతప్పిరోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని ఆయనను